నయనమనోహరం.. శ్రీవారి కల్యాణోత్సవం



పెళ్లి పీటలపై శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువుదీరిన శ్రీవారు

కదిరి పట్టణంలో వెలసిన శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేతుడైన స్వామివారి ఆర్జిత కల్యాణోత్సవం నయన మనోహరంగా సాగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలతో అలంకరించారు. కదిరి మల్లెలు, తులసి మాలలు, ఇతర పూలతో స్వామివారికి కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం శ్రీవారికి కల్యాణ కానుకలు సమర్పించారు. కార్యక్రమంలో అర్చకులు ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. - కదిరి

కొట్టంలో కార్యాలయం..!

వర్షం వస్తే విధులకు ఆటంకం

ఇబ్బందులు పడుతున్న సెబ్ సిబ్బంది



ధర్మవరం సెబ్ కార్యాలయం




పెంకుటిల్లు, బోద కొట్టంలో నిర్వహిస్తున్న కార్యాలయం



కూలేందుకు సిద్ధంగా ఉన్న కొట్టం

ధర్మవరంరూరల్, ఆగస్టు 18: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్).. ఇసుక, మద్యం తదితరాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడమే పని. అక్రమ రవాణా చేస్తున్న వాటిని పట్టుకుని, జరిమానాలు విధిస్తుంటారు సెబ్ అధికారులు. ఆ విభాగానికి నిధుల కొరతే ఉండదు. ప్రభుత్వానికి నిత్యం ఏదో ఒక రూపంలో ఆదాయం సమకూర్చుతుంటుంది. అంటే.. దండిగా ఆదాయం ఉన్న విభాగం అన్న మాట. అలాంటి విభాగ కార్యాలయాన్ని ఓ చిన్న కొట్టంలో నిర్వహిస్తున్నారు. నమ్మడానికి కష్టంగా ఉన్నా.. ఇది వాస్తవమే. వర్షం వస్తే.. ఆ రోజు కొట్టంలో విధులు నిర్వర్తించలేని దుస్థితి ఏర్పడుతుంది. ధర్మవరంలోని సెబ్ కార్యాలయ దుస్థితి ఇది. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సెబ్ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. రెండు గదులు ఉండగా.. అందులో ఒకదాని పైకప్పు పెంకులతో నిర్మించారు. మరొక గదికి బోదతో పైకప్పు వేశారు. ఆ కార్యాలయంలోనే సిబ్బంది విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సెబ్ కార్యాలయాన్ని చూసిన ప్రతిఒక్కరూ ఇది కార్యాలయమేనా అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వర్షం వస్తే చాలు కొట్టం అంతా కారి భారీగా నీరు చేరుతోంది. దీంతో విధులకు తీవ్ర ఆటంకం కలుగుతోందని సిబ్బంది వాపోతున్నారు. కొట్టంపై టార్పాలిన్ పట్ట వేసి, కాలం నెట్టుకొస్తున్నారు. వర్షం వస్తే కార్యాలయంలోని ఫైల్స్ ఎక్కడా తడిసిపోతాయని వారు ఆందోళన చెందుతున్నారు. పట్టుబడిన మద్యం, నాటుసారాను ఉంచేందుకు స్థలం కూడా లేదు. ఏళ్లుగా కొట్టంలోనే సెబ్ కార్యాలయం నిర్వహిస్తుండడం శోచనీయం. కార్యాలయంలో సీఐ, ఎస్ఐ, సిబ్బంది పనిచేస్తున్నారు. ఇప్పటికైనా ఆ శాఖ ఉన్నతాధికారులు స్పందించి, నూతన కార్యాలయాన్ని మంజూరు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం



కార్యాలయ పరిస్థితిని ఉన్నతాధికారులకు వివరించాం. వర్షం వస్తే ఇబ్బందికరంగా ఉంటోంది. అయినా విధులు నిర్వర్తిస్తున్నాం. నూతన కార్యాలయ మంజూరు కోరుతూ ఉన్నతాధికారులకు నివేదిక పంపాం.

- గురుప్రసాద్, సెబ్ సీఐ, ధర్మవరం

■ నేడు రక్షాబంధన్

ఈ బంధం.. అపురూపం..



భారతీయ సంస్కృతిలో అన్నచెల్లెళ్ల బంధం.. ఎంతో అపురూపమైనది. అలాంటి బంధానికి ప్రతీకగా చేసుకునేది రాఖీపండుగ. శ్రావణ మాస పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం రక్షాబంధన్ చేసుకుంటారు. అన్నకు చెల్లి రాఖీ కట్టి, ఆశీర్వాదం తీసుకుంటుంది. ఈ నేపథ్యంలో ఆదివారం రాఖీల కొనుగోళ్లలో యువతులు, మహిళలు బిజీగా కనిపించారు. - పుట్టపర్తి

క్రీడలు ఎంతో అవసరం

మంత్రి సవిత.. ముగిసిన యూటీఎఫ్ క్రికెట్ టోర్నీ



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ, ఆగస్టు 18: పనిభారంతో సతమతమయ్యే ఉద్యోగులకు క్రీడలు ఎంతో అవసరమని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. స్థానిక జూనియర్ కళాశాల క్రీడామైదానంలో యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా నిర్వహించిన జిల్లాస్థాయి టీచర్స్ క్రికెట్ టోర్నీ ముగింపు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. జిల్లాస్థాయి క్రీడల్లో పాల్గొనడం మూలంగా శారీరక, మానసిక ఉల్లాసం పొందవచ్చన్నారు. ఒత్తిడిలేని బోధన కొనసాగించవచ్చన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించి జీఓ 117 రద్దు విషయమై, ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి, న్యాయం చేసేలా చూస్తానని హామీ ఇచ్చారు. యూటీఎఫ్ జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీని నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం విన్నర్, రన్నరప్ జట్లకు ట్రోఫీలు అందజేశారు.

విజేత.. రొళ్ల జట్టు

యూటీఎఫ్ క్రికెట్ టోర్నీ ఫైనల్లో ధర్మవరం, రొళ్ల జట్లు తలపడ్డాయి. తొలుత రొళ్ల జట్టు 16 ఓవర్లలో 114 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ధర్మవరం జట్టు 15 ఓవర్లలో 103 పరుగులు మాత్రమే చేసింది. రొళ్ల జట్టు విజేతగా నిలిచింది. కార్యక్రమంలో యూటీఎఫ్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అంతిమయాతన..!

నడుములోతు నీటిలోనే శ్మశానానికి..



మృతదేహంతో వంక దాటుతున్న గ్రామస్థులు

పెనుకొండ రూరల్, ఆగస్టు 18: రొద్దం మండలంలోని కంబాలపల్లిలో అంతిమయాత్ర అంటే.. అవస్థలే. శ్మశానానికి వెళ్లడానికి దారి లేదు. వంక దాటుకుని వెళ్లాలి. ఆదివారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మరణించాడు. శ్మశానానికి తీసుకెళ్లాలంటే వంక దాటాలి. వర్షం కురవడంతో వంకలో నడుంలోతు నీరు ప్రవహిస్తోంది. మృతదేహాన్ని మోసుకుని, వంక దాటాలంటే మృతుడి కుటుంబీకులు, బంధువులు పడిన బాధలు వర్ణనాతీతం. పురుషులు ఎలాగోలా వెళ్లగలరు. అంత్యక్రియల్లో మహిళలు పాల్గొనాలంటే వంక దాటలేక అక్కడే ఉండిపోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి శ్మశానానికి దారి ఏర్పాటు చేయాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు.

వాన బీభత్సం

కదిరిలో నేలకొరిగిన చెట్లు.. పిడుగుపడి ఆవు, గొర్రెలు మృతి

కదిరి అర్బన్, ఆగస్టు 18: జిల్లాలో పలుచోట్ల ఆదివారం వాన బీభత్సం సృష్టించింది. కదిరిలో ఉరుములు, గాలితో కూడిన వర్షం కురిసింది. విద్యుత్ కార్యాలయం, ప్రభుత్వ ఆస్పత్రి, బస్టాండు ప్రాంతాల్లో చెట్లు విరిగిపడ్డాయి. వాణీవీధిలో ఓ ఇంటి పైకప్పు రేకులు గాలికి ఎగిరిపోయాయి. వర్షపునీరు ఇంట్లోకి చేరింది. దీంతో దాదాపు 4 గంటలపాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.



కదిరిలోని విద్యుత్ కార్యాలయంలో నేలకొరిగిన చెట్టు



కదిరిలోని వాణీవీధిలో ఎగిరిపోయిన ఇంటి పైకప్పు రేకులు

ఆవు, 23 గొర్రెల మృతి

గాండ్లపెంట: పిడుగుపాటుకు మండలంలోని పోతినేపల్లి వాసి వెంకటరమణకు చెందిన 23 గొర్రెలు, ఆవు మృతిచెందాయి. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వెంకటరమణకు గొర్రెలే జీవనాధారం. అతడికి దాదాపు 80 గొర్రెలున్నాయి. వాటిని ఆదివారం మేతకు తుమ్మలబైలు సమీపంలోని గొడ్డివెగల కోటకు తోలుకెళ్లాడు. మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో గొర్రెలు, ఆవు చెట్టుకిందికి వెళ్లాయి. ఆ చెట్టుపై పిడుగు పడడంతో 23 గొర్రెలు, పాడి ఆవు మృతిచెందాయని బాధితుడు కంటతడి పెట్టాడు. దీంతో రూ.3లక్షలు నష్టపోయినట్లు ఆవేదన చెందాడు. పశువైద్య, రెవెన్యూ అధికారులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు.



పిడుగుపాటుకు మృతిచెందిన గొర్రెలు, ఆవు

అమరాపురంలో అత్యధికం

పుట్టపర్తిరూరల్: జిల్లాలో శనివారం రాత్రి పలుప్రాంతాల్లో ఓమోస్తరు వర్షం కురిసినట్లు వాతావరణ శాఖాధికారులు తెలిపారు. అమరాపురంలో 45.6 మి.మీ వర్షపాతం నమోదైందన్నారు. సోమందేపల్లి 45.2, చిలమత్తూరు 41.8, గుడిబండ 33.2, రొళ్ళ 32.4, అగళి, తనకల్లు 24.6, పెనుకొండ 24.4, మడకశిర 23.2, నల్లచెరువు 22.6, పరిగి 18.4, రొద్దం 16.4, లేపాక్షి 12.0, గోరంట్ల 10.4, చెన్నేకొత్తపల్లి 9.8, రామగిరి 8.8, హిందూపురం 7.6, ధర్మవరం 5.4, ఓబుళదేవరచెరువు 3.4, తలుపుల 2.8, గాండ్లపెంటలో 2.0 మి.మీ, వర్షం కురిసినట్లు తెలిపారు.

వైసీపీ నేత డైరెక్షన్‌లో తప్పుడు నివేదిక?

లేపాక్షి, ఆగస్టు 18: మండలంలోని బయన్నపల్లి గుట్ట క్వారీలో విచ్చలవిడి బ్లాస్టింగ్‌లపై అధికారులు తప్పుడు నివేదికలు రూపొందించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజాభిప్రాయాలకు విరుద్ధంగా ఓ వైసీపీ నాయకుడి కనుసన్నల్లో అధికారులు నివేదిక మార్చినట్లు చర్చ సాగుతోంది. క్వారీలో విచ్చలవిడి పేలుళ్లపై పశువుల కాపర్లు, పంటలు నష్టపోతున్న రైతులు.. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశారు. 'పగటిపూట బ్లాస్టింగ్‌పై ప్రజల ఆగ్రహం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ఈనెల 17న కథనం ప్రచురించింది. దీంతో స్పందించిన తహసీల్దార్ సౌజన్యలక్ష్మి.. విచారణ చేయించారు. మైనింగ్ అధికారులు.. గ్రామసభ ఏర్పాటుచేసి, అభిప్రాయాలు స్వీకరించారు. ప్రజలు సైతం క్వారీలో పేలుళ్ల కారణంగా వెలువడే శబ్దాలకు గృహాలు నెర్రెలు చీలుతున్నాయనీ, కెమికల్ వాసన కారణంగా అస్వస్థతకు లోనవుతున్నామని చెప్పారు. ఆ తరువాత ఓ వైసీపీ నేత ఎంటరైనట్లు తెలుస్తోంది. అతడిని వెంటబెట్టుకుని మైనింగ్ అధికారులు ఓ ఇంటి వద్ద కూర్చుని క్వారీలో పనులే జరగట్లేదని గ్రామస్థులు రాసిచ్చినట్లు వారే రాసుకుని, తప్పుడు నివేదిక సృష్టించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిని తహసల్దార్ సౌజన్యలక్ష్మీ దృష్టికి తీసుకెళ్లగా.. మరోసారి విచారణ చేపడతామని తెలిపారు. విచారణాధికారుల తీరుపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డబ్బుకు కక్కుర్తిపడి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యథేచ్ఛగా బ్లాస్టింగ్‌లు చేస్తున్నా, భారీ వాహనాలతో కంకర తరలిస్తున్నా అధికారులు పనులేజరగడం లేదని చెప్పడం హాస్యాస్పదమన్నారు. ఉన్నతాధికారులను సైతం తప్పుదోవ పట్టించే పనిలో మైనింగ్ అధికారులు నిమగ్నమయ్యారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, క్వారీపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



వైసీపీ నేత అండతో తప్పుడు నివేదిక తయారుచేస్తున్న మైనింగ్ అధికారులు



క్వారీ నుంచి కంకర తరలించడానికి సిద్ధంగా ఉన్న వాహనాలు




శోభాయాత్రలో పాల్గొన్న ఎన్టీయార్ జిల్లా భక్తులు, ప్రారంభిస్తున్న ఆర్జే రత్నాకర్

వైభవంగా శోభాయాత్ర

పుట్టపర్తి, ఆగస్టు 17: ఎన్టీయార్ జిల్లా భక్తులు సత్యసాయి శోభాయాత్రను ఆదివారం పట్టణంలో వైభవంగా నిర్వహించారు. స్థానిక సత్యమ్మగుడి వద్ద సత్యసాయి రథాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ రథానికి పూజలు చేసి, శోభాయాత్రను ప్రారంభించారు. సత్యమ్మ గుడి నుంచి చెక్కభజన, కోలాటం, మంగళవాయిద్యాలు, విద్యార్థుల కవాతు, భక్తిగీతాల ఆలాపన ద్వారా గణేష్ గేట్ వరకు యాత్ర చేపట్టారు. వెయ్యిమంది భక్తులు యాత్రలో పాల్గొన్నారు.

టమోటా మార్కెట్‌లో నయా దందా..!

లారీ అసోసియేషన్ మాటున పైసా వసూల్
మార్కెట్‌కు వచ్చివెళ్లే వాహనాల నుంచి వసూలు
పంచాయతీకి రూ.అరకోటికిపైగా నష్టం

అనంతపురంరూరల్, ఆగస్టు 18: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో నయా దందా సాగుతోంది. మార్కెట్‌కు వచ్చి వెళ్లే వాహనాల నుంచి అనధికారికంగా వసూళ్లు చేపట్టారు. లారీ అసోసియేషన్ మాటున పైసా వసూల్ వ్యవహారం సాగుతోంది. అయితే ఈ వ్యవహారం సాగిస్తున్నది మాత్రం మార్కెట్ అసోసియేషనేనన్న చర్చ ఆయా వర్గాల ద్వారా తెలుస్తోంది. రెండేళ్ల కిందట వరకు స్థానిక పంచాయతీ ఆధ్వర్యంలో వేలం నిర్వహించి మార్కెట్‌కు వచ్చి వెళ్లే వాహనాల నుంచి సుంకం వసూలు చేసేవారు. ఈ విధానాన్ని తప్పుపడుతూ వాహనాల నుంచి సుంకం వసూలు చేయకూడదంటూ కోర్టు ఆదేశాలున్నాయంటూ నిలిపివేశారు. ప్రస్తుతం అదే సుంకాన్ని అసోసియేషన్ పేరిట వసూలు చేస్తుండటం ఆయా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పంచాయతీకి వచ్చే ఆదాయానికి గండి కొడుతున్నారని గ్రామస్థులు విమర్శిస్తున్నారు.


అసోసియేషన్ మాటున వసూలు..

టమోటా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ వసూళ్ల పర్వం సాగుతున్నట్లు తెలుస్తోంది. అనంతపురం మిని లారీ అసోసియేషన్ పేరుతో వసూలు చేస్తున్నారు. ఈ విధంగా వసూలు చేయడాన్ని విరాళంగా తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. దేనికి విరాళమో..? సంబంధిత అసోసియేషన్ సభ్యులకే తెలియాలి. ఒక్కో వాహనం నుంచి ఒక్కో విధంగా వసూలు చేస్తున్నారు. బొలేరో, ఐచర్ వాహనాల నుంచి వంద చొప్పున, లారీల నుంచి రూ.200 చొప్పున వసూలు చేస్తున్నట్లు ఆయా వర్గాల ద్వారా తెలుస్తోంది. ఆపై వాహనాలకు రూ.2వేలు వసూలు చేస్తున్నట్లు చర్చసాగుతోంది. మార్కెట్ నుంచి ఎక్కువగా దూరప్రాంతాలకు టమోటా ఎగుమతి అవుతున్నాయి. వీటి ఎగుమతులు పెద్ద వాహనాలను ద్వారా సాగి



మార్కెట్ ఎంట్రెన్స్‌లో వాహన వివరాలు తెలుసుకుంటున్న వ్యక్తి

స్తున్నారు. వీటి సంఖ్య రోజూ 50కిపై మాటే. అంటే వంద లారీలకు రూ.200 చొప్పున లెక్కవేసుకున్నా రూ.20వేలు, వంద బొలేరో, ఐచర్ వాహనాలకు రూ.100చొప్పున రూ.10వేలు, ఆపై వాహనాలకు ఒక్కొక్కదానికి రూ.2వేలు అంటే ఇలాంటి వాహనాలు రోజు 50పైనే వెళ్తున్నట్లు ఆయా వర్గాల సభ్యులే అంటున్నారు. ఈ లెక్కన రోజుకు రూ.లక్ష వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. నెలకు రూ.30లక్షలు వసూలు చేస్తున్నట్లు ఆ వర్గాల సభ్యులు అంటున్నారు. ఈ సొమ్ము అంతా ఎవరికి వెళుతోంది? దేనికి వినియోగిస్తున్నారన్నది తెలియడం లేదని స్థానిక మార్కెట్‌లోని కొంత మంది గుసగుసలాడుకోవడం గమనార్హం. వాహనదారులు అసోసియేషన్‌కు డబ్బు చెల్లించారా లేదా అన్న విషయాలు తెలుసుకుని వివరాల నమోదుకు మార్కెట్ ప్రారంభంలో ఓ ఇద్దరు వ్యక్తులు ఉంటున్నారు. ఆ వ్యక్తులు



మిని లారీ అసోసియేషన్ పేరిట విరాళం రూపంలో వాహనదారులకు ఇస్తున్న రసీదు

కట్టె చేతపట్టి వాహనాలు నిలుపుతుంటారు. అసోసియేషన్‌కు సంబంధించిన రసీదు చూపిస్తే పంపుతారు. లేదంటే ఆ వాహనం నెంబరు ఓ బుక్కులో రాసుకుంటుండటం గమనార్హం.

పంచాయతీకి రూ.అరకోటికిపైగా నష్టం..

ఇదిలా ఉండగా మార్కెట్‌కు వచ్చి వెళ్లే వాహనాల ద్వారా సుంకం వసూలుకు పంచాయతీ ఆధ్వర్యంలో ప్రతి ఏటా వేలం నిర్వహించేవారు. పంచాయతీ నిబంధనల ప్రకారం నాలుగు చక్రాల వాహనాలకు రూ.100, ఆరు చక్రాల వాహనాలకు రూ.250, పది చక్రాల వాహనాలకు రూ.300, 12చక్రాల వాహనాలకు రూ.350, 14చక్రాల వాహనాల నుంచి రూ.450 చొప్పున వసూలు చేసేవారు. ఏటా పంచాయతీకి రూ.40లక్షల నుంచి రూ.50లక్షల వరకు ఆదాయం సమకూరేది. ఆ సొమ్మును పంచాయతీ అభివృద్ధికి వినియోగించేవారు. రెండేళ్ల వరకు ఈ ప్రక్రియ సవ్యంగానే సాగేది. కోర్టు ఉత్తర్వుల పేరుతో వాహనాల అసోసియేషన్ సభ్యులు సుంకం వసూలు చేయకూడదని నిలిపివేయించారు. అయినా గ్రామ అవసరాల నిమిత్తమంటూ గత ఏడాది పంచాయతీ పరిధిలోని కొంత మంది గ్రామపెద్దలు వసూలు చేశారు. ఆ సొమ్ము ఎక్కడకుపోయింది..? ఎవరికీ తెలీయడం లేదని గ్రామస్థులు అంటున్నారు. ఈ ఏడాదీ అదే పరిస్థితి నెలకొంది. ఎవరైతే సుంకం వసూలు చేయకూడదని కోర్టు ఉత్తర్వులు చూపించి నిలిపివేశారో ఆ అసోసియేషన్ పేరుతో విరాళం మాటున వసూలు చేస్తుండటం ఆయా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఒక వేళ నేటికీ సుంకం వసూలు జరిగి ఉంటే పంచాయతీ మరింత అభివృద్ధి జరిగేదని గ్రామస్థులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు ఆ దిశగా ఆలోచించి పంచాయతీకి నిధులు సమకూరేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

తిరుమలలో అన్నదానం అద్భుతం

మంత్రి పయ్యావుల కేశవ్



వెంగమాంబ అన్నదాన సత్రంలో భక్తులతో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్

అనంతపురం అర్బన్, ఆగస్టు 18: తిరుమలలోని శ్రీ వెంగమాంబ అన్నదాన సత్రంలో అన్నదానం అద్భుతమని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ఆదివారం తిరుమలలోని శ్రీ వెంగమాంబ అన్నదాన సత్రాన్ని మంత్రి పయ్యావుల కేశవ్ పరిశీలించారు. సామాన్య భక్తులతో కలిసి క్యూలైన్‌లో ఆయన సత్రంలోకి వెళ్లారు. అన్నదానం ఎలా జరుగుతోందని అక్కడి భక్తులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీటీడీ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా నాణ్యమైన భోజనాన్ని అందించడం జరుగుతోందన్నారు.

విధుల్లో చేరిన జీఆర్పీ ఎస్పీ



గుంతకల్లు, ఆగస్టు 18: రైల్వే పోలీసుశాఖ (జీఆర్పీ) ఎస్పీగా రాహుల్ మీనా ఆదివారం ఉదయం స్థానిక జీఆర్పీ గుంతకల్లు జిల్లా కార్యాలయానికి వచ్చి విధుల్లో చేరారు. ఏఎస్పీగా విధులను నిర్వర్తించిన మీనా పదోన్నతిపై జీర్పీ శాఖకు బదిలీ అయ్యారు. విధుల్లో చేరిన ఆయన మాట్లాడుతూ నేరాలను అదుపు చేయడానికి కృషిచేస్తానన్నారు. రైల్వే డివిజన్‌లో అత్యంత సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిపెట్టనున్నట్లు తెలియజేశారు. ఆర్పీఎఫ్, సివిల్ పోలీసు శాఖల సమన్వయంతో పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో జీఆర్పీ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, గుంతకల్లు జీఆర్పీ సీఐ నగేశ్‌బాబు, పోలీసు అధికారుల సంఘ నాయకుడు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కసాపురం ఆలయంలో పూజలు

జీఆర్పీ ఎస్పీ రాహుల్ మీనా ఆదివారం ఉదయం కసాపురంలోని శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన ఎస్పీని ఆలయ అధికారులు, అర్చకులు ఆహ్వానించి స్వామివారి సన్నిధిలో నామార్చనలు చేశారు. స్వామివారి శాలువ వేసి, ప్రసాదాలను అందజేసి ఆశీర్వచనం పలికారు. కార్యక్రమంలో జీఆర్పీ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, ఆలయ సూపరింటెండెంట్ పిడికిటి వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

కారులో వచ్చారు.. దర్జాగా చోరీ చేశారు..

హిందూపురంలో చోరీలు



చోరీ జరిగిన దుస్తుల దుకాణాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐ

హిందూపురం, ఆగస్టు 18: దర్జాగా కారులో వచ్చారు... రెండు దుకాణాల్లో చోరీ చేసి వెళ్లిపోయారు. హిందూపురంలో శనివారం రాత్రి జరిగిన ఈ సంఘటనపై టూటౌన్ సీఐ అబ్దుల్ కరీం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుర్తు తెలియని నలుగురు వ్యక్తులు ఎక్స్‌యూవీ 500 కారులో వచ్చి డీఎల్‌రోడ్డులో రెక్కీ నిర్వహించారు. అదే రోడ్డు పక్కన పై అంతస్తులో ఉన్న శ్యామ్‌సంగ్ షోరూమ్ షెట్టర్ బలవంతంగా పైకెత్తి లోనికి ప్రవేశించినట్లు అక్కడి సీసీ కెమెరాలో రికార్డుఅయింది. ఆ సమయంలో వారు ముఖానికి మాస్కు, చేతులకు గ్లౌజులు ధరించారు. వేలిముద్రలు పడతాయని వారివెంట తెచ్చుకున్న ఆయిల్‌ను షట్టర్‌పై చల్లినట్లు తెలుస్తోంది. షాపులో నగదు లేకపోవడంతో వెనుతిరిగారు. అదేవిధంగా స్థానిక రైల్వేరోడ్డులో యుగంధర్‌కు చెందిన బట్టల దుకాణంలోనూ చోరీ జరిగింది. దుండగులు దుకాణం షట్టర్ తెరచి లోనికి వెళ్లారు. దుకాణంలో ఉన్న రూ.10వేలు నగదు, 20జతల దుస్తులను ఎత్తుకెళ్లారు. ఈ రెండు దుకాణాల్లో చోరీకి పాల్పడింది ఒకే గ్యాంగ్ అయి ఉండొచ్చు. స్థానికులు ఆదివారం ఉదయం గమనించి ఆయా దుకాణాల నిర్వాహకులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా చోరీ జరిగిన రెండు దుకాణాలనూ ఇన్‌చార్జ్ డీఎస్పీ శ్రీనివాసులు సిబ్బందితో పరిశీలించారు.

ఉచిత వైద్యశిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 18: రియా ప్రైవేట్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. శిబిరానికి వచ్చిన పేదలకు డాక్టర్లు ఉదయ్‌కుమార్, గీతా వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, సీఈఓ మురళీకృష్ణ మాట్లాడుతూ బీపీ, షుగర్, ఈసీజీ తదితర పరీక్షలకు రూ.4వేల ఖర్చు అవుతుందని అయితే రూ.999లకే సదుపాయం కల్పించామని తెలిపారు. 18వ తేదీ వరకు నిర్వహించే ఉచిత శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నమ్మించి మోసం చేశాడు

● బాలికను గర్భవతి చేసిన ఘనుడు

హిందూపురం, ఆగస్టు 18: బాలికను నమ్మించి మోసం చేసి గర్భవతిని చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అప్‌గ్రేడ్ సీఐ ఆంజనేయులు తెలిపిన వివరాల మేరకు హిందూపురం మండలంలోని ఓ గ్రామానికి చెందిన 16ఏళ్ల బాలికను రాజేష్(26) గత నాలుగేళ్లుగా పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భం వచ్చేలా చేశాడు. నాలుగు రోజుల క్రితం బాలిక అనారోగ్యం బారిన పడగా తల్లిదండ్రులు కర్ణాటకలోని గౌరీబిదనూరు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. బాలికను పరీక్షించిన వైద్యులు ఐదు నెలల గర్భవతి అని చెప్పారు. చిక్కబళ్లాపురం జిల్లా సీడీపీఓ అధికారికి విషయం చేరవేయగా వారు ఆసుపత్రికి వచ్చి బాలికను తీసుకెళ్లారు. ఈ విషయాన్ని హిందూపురం అప్‌గ్రేడ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీనిపై ఎస్సీ, ఎస్టీ కేసుతోపాటు పోక్సో కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు. ఇదిలా ఉంటే బాలికను మోసం చేసిన యువకుడు ఇటీవల హత్యకేసులో నిందితుడిగా ఉన్నాడు. జైలులోనే ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బాలికల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రతిభను వెలికితీసేందుకే కేపీఎల్ టోర్నీ

● రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

కళ్యాణదుర్గం, ఆగస్టు 18: యువతలో దాగి వున్న ప్రతిభను వెలికి తీయాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కేపీఎల్ పేరుతో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత కొనియాడారు. ఆదివారం పట్టణంలోని కరణం చిక్కప్ప క్రీడా మైదానంలో కేపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌కు మంత్రితో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బీకే పార్థసారధి, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, కాలవ శ్రీనివాసులు, ఎంఎస్ రాజు, గుమ్మనూరు జయరామ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్ హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ఆడుదాం ఆంధ్ర పేరుతో కోట్లాది రూపాయలను నొక్కేసిన ఘనత జగన్‌రెడ్డికే దక్కిందన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు కేపీఎల్ పేరుతో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించాలనే ఆలోచన రావడం ఇక్కడి యువకుల అదృష్టం అన్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి నాలుగు రోజుల పాటు టోర్నమెంట్ నిర్వహించడం ఆశామాషీ కాదన్నారు. అమిలినేని సేవలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అమిలినేని మాట్లాడుతూ నియోజకవర్గంలో యువకుల్లో మంచి ప్రతిభ వుందన్న ఉద్దేశంతోనే ఈ పోటీలు నిర్వహించామన్నారు. నాలుగు రోజుల పాటు 32 మ్యాచ్‌లను ఫ్లడ్ లైట్ల వెలుతురులో అర్ధరాత్రి 12 గంటల వరకు కొనసాగించే విధంగా ఎంతో కష్టపడ్డామన్నారు. యువతకు చదువుతో పాటు



కేపీఎల్ చాంపియన్ ట్రోఫీని మంత్రి సవిత చేతుల మీదుగా అందుకుంటున్న కార్తీక్ కింగ్స్ టీమ్

క్రీడలూ ముఖ్యమని ఆ విద్య, క్రీడలను అభివృద్ధి పథంలో నడిపిస్తానని హామీ ఇచ్చారు. విజేతగా నిలిచిన కార్తీక్ కింగ్స్ టీమ్‌కు రూ.2 లక్షల నగదుతో పాటు ట్రోఫీని అందజేశారు. అలాగే రన్నర్స్‌గా నిలిచిన గరుడ జ్ఞాన భారతి టీమ్‌కు రూ.లక్ష నగదుతో పాటు ట్రోఫీను అందజేశారు. మూడవ స్థానంలో నిలిచిన మీసేవా ఫైటర్స్‌కు రూ.50 వేలు నగదుతో పాటు ట్రోఫీను అందజేశారు. ఆర్డీవో రాణి సుస్మిత, ఎస్ఆర్‌సీ సిబ్బంది, క్రికెట్ అభిమానులు పాల్గొన్నారు.

పోరాట స్ఫూర్తిప్రదాత ఎంవీ రమణ

సంస్మరణ సభలో సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

అనంతపురం విద్య, ఆగస్టు 18: ఎంవీ రమణ పోరాటాల స్ఫూర్తి ప్రదాత అని, విప్లవోద్యమానికి జీవితాన్ని అంకితం చేశారని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ కొనియాడారు. ఆదివారం నగరంలోని లలితకళాపరిషత్‌లో రమణ సంస్మరణ సభను నిర్వహించారు. జాతీయకార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగేశ్వర్‌రావు, రాష్ట్రకార్యదర్శి వర్గసభ్యులు జగదీష్, ఓబులేసు, ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి జాఫర్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంవీ రమణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయకార్యదర్శి నారాయణ మాటాడుతూ ఎంవీ రమణ సుమారు 60 ఏళ్లపాటు ఉద్యమంలో పనిచేశారని గుర్తుచేశారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ విశాఖ ఉక్కుఉద్యమంలో ఎంవీ రమణ కీలకభూమిక పోషించారన్నారు. సామాన్య పార్టీశ్రేణుల్లో నిరాడంబరంగా కలసిపోయేవారన్నారు. సహాయకార్యదర్శి నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ సీమ కరువు నివారణ ఉద్యమంలో రమణ పాత్ర కీలకమైందన్నారు. సమాజశ్రేయస్సు తనవం



మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



ఎంవీ రమణ చిత్రపటం నివాళి అర్పిస్తున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తదితరులు

తుగా నిత్యం కృషిచేశారని కొయాడారు. అనంతపురం ఎంపీ అంబికాలక్ష్మీనారాయణ మాట్లాడుతూ అనంతపురం జిల్లా రైతాంగం, రాయలసీమ రైతుల సమస్యలపై ఆయనకు స్పష్టమైన అవగాహన ఉందన్నారు. ఆయన నుంచి అందరూ స్ఫూర్తి పొందాలని సూచించారు. అనంతరం జగదీష్, రాంభూపాల్, కోగటం విజయభాస్కర్ రెడ్డి, జాఫర్ ఎంవీ రమణ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రామాంజినేయులు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్రఅధ్యక్షుడు జాన్సన్‌బాబు, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు చంద్రానాయక్, వేమయ్యయాదవ్, రమణయ్య, కుళ్లాయిస్వామి పాల్గొన్నారు.

దోపిడీదారుల గుండెల్లో బాంబుపేల్చేది పాట

● పాలనలో మహిళలకు సగభాగం ఇవ్వాలి
● గద్దర్ వర్ధంతి సభలో ఆయన కుమార్తె వెన్నెలమ్మ

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 18: చదువురాని వారికి సైతం మాట్లాడటం, రాయటం, నాట్యం నేర్పించి చైతన్యవంతులను చేసే పాటకు దోపిడీదారుల గుండెల్లో బాంబుపేల్చే శక్తి ఉంటుందని ప్రజాయుద్ధనౌక గద్దర్ కుమార్తె వెన్నెలమ్మ అన్నారు. ఆదివారం బహుజన యువసేన సామాజిక న్యాయ ఉద్యమ వేదిక ఆధ్వర్యంలో గద్దర్ ప్రథమ వర్ధంతి సభను నిర్వహించారు. ఆ వేదిక ప్రతినిధులు చంద్రచర్ల హరి, ఆదినారాయణ, కుళ్లాయప్ప అధ్యక్షతన ఏర్పాటుచేసిన సభకు ముఖ్య అతిథులుగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, గద్దర్ కుమార్తె వెన్నెలమ్మ, అరుణోదయ కళామండలి ఉమ్మడి రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు విమలక్కతోపాటు జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి, ఫర్ ద సొసైటీ ఫౌండర్ పోతుల రాధాకృష్ణ, ఆర్ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రామచంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెన్నెలమ్మ మాట్లాడుతూ మహిళలను పాలనలో సగభాగం ఎందుకు చేయడంలేదని ప్రశ్నించారు. పాలనలో సమానంగా కూర్చున్నప్పుడే మహిళాసాధికారత నెరవేరుతుందని



మాట్లాడుతున్న వెన్నెలమ్మ

గద్దర్ ఆకాంక్షించారన్నారు. విమలక్క మాట్లాడుతూ ప్రజలు చరిత్ర నిర్మాతలని వారిని గెలిపించడానికి పాట ఎప్పటికీ అండగా నిలుస్తుందని తెలిపారు.

సమస్యలను పాటతో వివరించారు: ఎంపీ అంబికా

ప్రజానాట్య మండలిద్వారా పాటల రూపంలో పల్లె ప్రగతి, ప్రజల సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లిన ప్రజాకవి గద్దర్ అని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కొనియాడారు. బానిస వర్గాల దుర్భర పరిస్థితులను కళ్లకు కట్టినట్లు పాటలతో తెలిపారన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు నాగన్న, రాజారాం, నాగభూషణ, సుగమంచి శ్రీనివాసులు, రామకృష్ణ, రిటైర్డు న్యాయాధికారి కిష్టప్ప పాల్గొన్నారు.

కోర్టు పరిధిలోని భూములను ఎలా ఆక్రమిస్తారు?

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మండిపాటు

కూడేరు, ఆగస్టు 18: కోర్టు పరిధిలో ఉన్న అగ్రిగోల్డ్ భూములను ఎలా ఆక్రమిస్తారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మండిపడ్డారు. ఆదివారం ఆయనతోపాటు అగ్రిగోల్డ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ముప్పాల నాగేశ్వరరావు, సీపీఐ నాయకులతో కలిసి కూడేరు మండలం కమ్మూరు వద్దనున్న అగ్రిగోల్డ్ భూములను పరిశీలించి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ కమ్మూరు వద్దనున్న ఫార్చ్యూన్ అనంత పేరుతో 221.45 ఎకరాల భూమిలో కొందరు వ్యక్తులు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని అగ్రిగోల్డ్ బాధితులు అడ్డుకున్నారన్నారు. అమాయకులతో డబ్బులు కట్టించుకొని బాధితులకు న్యాయం చేయకుండా బినామీ పేర్లతో కొందరు వ్యక్తులు ప్లాట్లు వేసుకొని అమ్ముకుంటున్నారని మండిపడ్డారు. కోర్టు ఆధీనంలో ఉన్న భూములను ఎలా వెంచర్లు వేస్తారని నిలదీశారు. అగ్రిగోల్డ్ కంపెనీలో కొందరు రాజకీయ నాయకులు తమ బినామీలను అడ్డుపెట్టుకొని రూ.5 వేల కోట్లు విలువ చేసే భూములను ఇప్పటికే అమ్మకాలు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రభుత్వం తక్షణం దొంగల పేర్ల మీద ఉన్న భూములను స్వాధీనం చేసుకొని హైకోర్టులో అటాచ్‌లో ఉన్న భూములపై సర్వే నెంబర్ వారిగా విచారణ చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి సిద్ధేశ్వర, జిల్లా అధ్యక్షుడు నారాయణప్ప, ప్రధానకార్యదర్శి కుళ్లాయప్ప, అల్లీపీరా, ధనుంజయ, రాజశేఖర్‌రెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షులు నారాయణ స్వామి, కేశవరెడ్డి, జాన్సన్‌బాబు, కుళ్లాయిస్వామి, వేమయ్య యాదవ్, పెరుగు సంగప్ప, రమణ, మల్లికార్జున, శ్రీరాములు తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం అర్బన్, ఆగస్టు 18: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవిత సాఫల్య పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు డాక్టర్ సరోజమ్మ ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో జీవితాన్ని ఆరంభించి, రాష్ట్రపతిగా అత్యున్నత హోదాను అలంకరించి, గురువుల ఔన్నత్యాన్ని చాటి, దేశ అభ్యున్నతికి రాధాకృష్ణన్ పాటుపడ్డారన్నారు. తెలుగు రాష్ట్రాల్లో అదే స్ఫూర్తితో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు, ఆచార్యులు, ప్రధానాచార్యులతోపాటు వైద్య సామాజిక, సాంస్కృతిక, ఇతర వృత్తి రంగాల్లో శిక్షణ అందిస్తున్న గురువులకు జీవిత సాఫల్య పురస్కారాలు అందిస్తామన్నారు. డాక్టర్ రాధాకృష్ణన్ 126వ జయంతిని పురస్కరించుకొని సెప్టెంబరు 8వ తేదీన తిరుపతిలో నిర్వహించే గురుపూజోత్సవంలో బంగారు నంది పురస్కారాలు, ఎక్సలెన్సీ, ఉత్తమ గురువుల పురస్కారాలు ఇవ్వనున్నామని పేర్కొన్నారు. 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను 6302908528, 9705313061, 9440225924 వాట్సప్ నంబర్లకు పంపాలని కోరారు.

వధాన్య ఆలోచనలు నేటి యువతకు స్ఫూర్తి: కలెక్టర్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు18: వధాన్య జనసొసైటీ ఆలోచనలు నేటి యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. సమాజం గురించి ఆలోచించే యువత సొసైటీలో ఉండటం అభినందనీయమన్నారు. ఆదివారం పంగల్ రోడ్డులోని ఆర్డీటీ ఎకాలజీ సెంటర్ వదాన్య జనసొసైటీ ఫౌండర్ అశోక్‌పడపాటి ఆధ్వర్యంలో ఆ సొసైటీ 13వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. కలెక్టర్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. యువత కలిసికట్టుగా ముందుకు సాగాలన్నారు. మరిన్ని గొప్ప ఆలోచనలతో, ఆవిష్కరణలతో సమాజ శ్రేయస్సుకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. సొసైటీ సభ్యులు చేస్తున్న సేవా కార్యక్రమాలు మున్ముందు కొనసాగించాలన్నారు. ఏపీ టీఎస్ రాష్ట్ర ఐటీ అడ్వైజర్ డా. జేఏ చౌదరి మాట్లాడుతూ ప్రభుత్వం ఐటీ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురాబోతుందన్నారు. గ్రామీణ స్థాయి యువతకి ఐటీ రంగాన్ని మరింత చేరువ చేసేందుకు నూతన ఆలోచనతో స్టార్టప్‌లతో కొత్త పథకం ప్రారంభించనుందన్నారు. సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమాల్ని ప్రభుత్వాలు, యువత స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యంతో నిర్వహించాలన్నారు. వధాన్య జనసొసైటీ ఫౌండర్ అశోక్ పడపాటి మాట్లాడుతూ సొసైటీ ఆధ్వర్యంలో రాబోవు రోజుల్లో డీఎస్సీ మెగా టాలెంట్ టెస్ట్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మ్యాథమెటిక్స్ టాలెంట్ టెస్టులు నిర్వహించనున్నామన్నారు. ఆర్డీటీ ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి, కన్సామ్ టికెట్ సీఈఓ శ్రీపాద వైద్య, ప్రముఖ ఐటీ నిపుణుడు రామ్‌కుమార్ వర్మ, పర్యావరణవేత్త లెనిన్ బాబు, డిస్కవరీ అనిల్, వదాన్య జనసొసైటీ కో-ప్రెసిడెంట్ అరుణ్, సభ్యులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

పవిత్రోత్సవాలకు శ్రీకారం

ధర్మవరంరూరల్, ఆగస్టు 18 : స్థానిక కొత్తపేటలో శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ఏటా శ్రావణమాసంలో మూడు రోజులు పాటు నిర్వహించే పవిత్రోత్సవాలకు ఆదివారం శ్రీకారం చుట్టారు. ఉదయం ఆలయ అర్చకులు సునీల్‌కుమారాచార్యులు, సుదర్శ నాచార్యులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను వివిధ రకాల పూల మాలలతో అలంకరించారు. వేదమంత్రాలతో మంగళవాయిద్యాల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం శ్రవణానక్షత్ర కల్యాణోత్సవం, సాయంత్రం అంకురార్పణ కార్య క్రమాన్ని నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ, అన్నమయ్య సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శిక్షణ



విద్యార్థులతో ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ సభ్యులు

ధర్మవరంరూరల్, ఆగస్టు 18 : స్థానిక సత్యకృప డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు చైతన్యం కోసం ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ఆధ్వర్యంలో రవిశంకర్ గురూజీ రూపొందించిన ఎస్‌ప్లస్ కోర్సుపై ఆదివారం అవగాహన కల్పించారు. ఆ సంస్థ సభ్యులు మణికంఠ, శ్రీకాంత్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఆత్మవిశ్వాసం, ఒత్తిడిని జయించడం, మనోబలం, ఉత్సాహం, క్రమశిక్షణ తదితర అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. ఈ కోర్సు ఐదు రోజుల పాటు నిర్వహిస్తామని, అనంతరం సర్టిఫికెట్లు అందజేస్తామని అన్నారు. ఈ కోర్సును కళాశాల కరస్పాండెంట్ పెద్దారెడ్డి సహకారంతో నిర్వహిస్తున్నామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ సభ్యులు సిరికల్చర్ ఈశ్వరయ్య, వెంకటనారాయణ, మల్లయ్య, ప్రమీల, వైష్ణవి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ చిన్నారి మృతి

బత్తలపల్లి ఆగస్టు 18 : మండలంలోని అనంతసాగరంలో ప్రమాదవశాత్తు నీళ్ల బకెట్‌లో పడిన ఓ చిన్నారి చికిత్స పొందుతూ మరణించింది. రాప్తాడు మండలం పెసరకుంటకు చెందిన ఆదెప్ప, బత్తలపల్లి మండలం అనంతసాగరంలో ఐదేళ్ల క్రితం పుష్పను వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కూమార్తెలు. పుష్ప తమ్ముడి వివాహానికి అనంతసాగరం గ్రామానికి వెళ్లింది. శనివారం సాయంత్రం కుటుంబ సభ్యులు పెళ్లి పనుల్లో ఉండగా.. పుష్ప చిన్న కుమార్తె మేగహర్షిత (18 నెలల) ఆడుకుంటూ బాత్‌రూంలోకి వెళ్లి... నీళ్ల బెకెట్‌లో పడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఆ చిన్నారి మరణించింది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తనకల్లు, ఆగస్టు 18: మండలంలోని నల్లగుట్లపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. మండల కేంద్రానికి చెందిన చిరు వ్యాపారులు శ్రీనివాసులు, కాలేషా ఓ శుభ కార్యక్రమానికి అన్నమయ్య జిల్లా ములకచెరువు వెళ్లారు. శనివారం రాత్రి ద్విచక్రవాహనంలో తనకల్లుకు వస్తుండగా... మార్గమధ్యలో నల్లగుట్లపల్లి సమీపంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడ్డారు. ఈప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కడపకు తరలించారు.



నూతన సభ్యులను అభినందిస్తున్న సహచర ఏఈఓలు

వ్యవసాయ విస్తరణ సంఘం ఎన్నిక ఏకగ్రీవం

పుట్టపర్తిరూరల్, ఆగస్టు 18: సత్యసాయి జిల్లా వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓ) సంఘాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలోని మండల వ్యవసాయ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా వై. ప్రభాకరరెడ్డి, రమణారెడ్డి వ్యవహరించారు. జిల్లా వ్యవసాయ విస్తరణ సంఘం జిల్లా అధ్యక్షుడిగా పుట్టపర్తి మండల ఏఈఓ ఆనంద్, కార్యదర్శిగా టీ రియాజ్, కోశాధికారిగా సీపీ మల్లికార్జున, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కేవీ రంగాచారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సీఆర్‌ఎంటీ కార్యవర్గం...

కొత్తచెరువు : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నతపాఠశాలలో సీఆర్‌ఎంటీ సమావేశాన్ని నిర్వహించి.. జిల్లా సీఆర్‌ఎంటీ కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీఆర్‌ఎంటీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడిగా బాబ్‌జాన్ గౌరవాధ్యక్షుడిగా వెంకటనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఓబిలేసు, కోశాధికారిగా భాస్కర్, ఉపాధ్యక్షులుగా రాము, ఓబులరాయ, ముత్యాలప్ప, లక్ష్మణ్, క్రిష్టప్ప, మహిళ కార్యదర్శిగా రిజ్వాన్‌ను ఎన్నుకున్నారు.



సీఆర్‌ఎంటీ జిల్లా నూతన కార్యవర్గం

వర్షం వస్తే బురద.. బురదే..

నల్లచెరువు, ఆగస్టు 18: మండల కేంద్రంలోని ఇండియన్ పెట్రోల్ బంక్ ఎదుట రహదారి అధ్వానంగా తయారైంది. మారిశెట్టిపల్లి, చెరువువాండ్లపల్లి, కుమ్మరవాండ్లపల్లి, మల్లిరెడ్డిపల్లి, ఓరువాయి, కమ్మవారిపల్లి, పులిమివాండ్లపల్లి, యనుములవారిపల్లి, పత్రవాండ్లపల్లి తదితర గ్రామాలకు వెళ్లే రహదారి ఇది. ఓ చిన్నపాటి వాన వస్తే చాలు.. ఆ రోడ్డంతా బురద.. బురద మయంగా మారుతోంది. వర్షపు నీరు నిల్వ ఉంటోంది. ద్విచక్రవాహనదారుల పరిస్థితి మరీ ఘోరం. పలుమార్లు ద్విచక్రవాహనాలు జారి పడటంతో అనేక మంది గాయపడ్డారు. ఇక పాదచారుల పరిస్థితీ అంతే. వర్షం వస్తే అటు వైపు వెళ్లడానికి వీలు లేకుండా పోతోంది. ఇదే రహదారిలో తహసీల్దార్ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, సచివాలయాలకు వెళ్లాల్సి ఉంది. అయినా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో మరికొన్ని రహదారుల పరిస్థితీ ఇలాగే ఉంది. అధికారులు స్పందించి... శాశ్వతంగా రోడ్డు వేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



నల్లచెరువులో చిత్తడిగా ఉన్న రహదారి

నిందితులను వెంటనే ఉరి తీయాలి





ధర్మవరంలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న సభ్యులు, శ్రీలలితనాట్యకళానికేతన్ బృందం నిరసన

ధర్మవరంరూరల్, ఆగస్టు 18 : కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్యచేసిన నిందితులను వెంటనే ఉరితీయాలని ముస్లిం మైనార్టీ డెవలప్‌మెంట్ అసోషియేషన్ ధర్మవరం నియోజకవర్గ అధ్యక్షుడు సయ్యద్ దాదాపీర్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని అసోషియేషన్ కార్యాలయంలో ముస్లింలతో కలిసి కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య దినోత్సవాన ఇలాంటి సంఘటన జరగడం సిగ్గుచేటని, కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి వీడి నిందితులకు ఉరిశిక్షపడేలా చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోషియేషన్ సభ్యులు ముస్కిన్‌వలి, తాహెర్, మున్టు, నూరుల్లా, జిలాన్, అల్లాబకాష్, హసీనా, అమ్మాజన్ పాల్గొన్నారు.

లలిత నాట్య కళా నికేతన్ ఆధ్వర్యంలో ...

కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన ఘటనకు నిరసనగా పట్టణంలోని శ్రీలలిత నాట్యకళానికేతన్ నాట్యచార్యులు బాబుబాలాజీ, కమలబాలాజీ, రామలాలిత్య ఆధ్వర్యంలో కళాకారులు నిరసన వ్యక్తం చేశారు. ఆదివారం రాత్రి కళానికేతన్ మందిరంలో కొవ్వొత్తులతో నిరసన మౌనప్రదర్శన చేశారు.

ఓబుళదేవరచెరువు: కోలకత్తాలో జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం చేసి, హత్యకు పాల్పడిన కామాంధులను ఉరితీయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం అంబేడ్కర్ సర్కిల్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండలాధ్యక్ష, కార్యదర్శులు కుళ్లాయప్ప, శ్రీరాములు, సర్పంచ్ గోవిందు, నాయకులు లక్ష్మీపతి, భవన కార్మికులు ఆనంద్, శ్రీనివాసులు, క్రిష్టానాయక్, కదిరప్ప, జయమ్మ, రమణమ్మ, మణి, కమల పాల్గొన్నారు.



ఓడీసీలో సీఐటీయూ నాయకుల నిరసన

డీఎస్సీ శిక్షణను సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి అర్బన్, ఆగస్టు 18: డీఎస్సీ, టెట్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం నిర్వహిస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. పట్టణ సమీపంలోని కుమ్మర వాండ్లపల్లి స్పేస్ కళాశాలలో కందికుంట నారాయణ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ శిబిరాన్ని ఆదివారం ప్రారంభించిన ఆయన మాట్లాడారు. టెట్, డీఎస్సీ అభ్యర్థులు దూర ప్రాంతాలకు వెళ్లి శిక్షణ తీసుకోవాలంటే ఇబ్బందులు పడుతున్నారని, అభ్యర్థులకు సౌకర్యార్థం కదిరిలోనే ఏర్పాటు చేశామని అన్నారు. కళాశాల యజమాన్యం ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి, అనీల్‌కుమార్‌రెడ్డి, స్పేస్ కళాశాల ఎంఎస్ ప్రశాంత్, నిర్వాకులు నగేష్ పాల్గొన్నారు.

నాలుగు బస్సులు ప్రారంభం

కదిరి : కదిరి ఆర్టీసీ డిపోకు నూతనంగా వచ్చిన నాలుగు బస్సులను ఎమ్మెల్యే కందికుంట ఆదివారం ప్రారంభించారు. డీఎం మైనోద్దీన్ మాట్లాడుతూ.. నాలుగు కొత్త బస్సుల్లో మూడు అనంతపురానికి, మరోకటి నెల్లూరుకు కదిరి నుంచి నడపనున్నట్లు చెప్పారు. పాతబస్సుల స్థానంలో కొత్త బస్సులను నడపుతామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డిపో మేనేజర్ హరిత, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.


జీఓ నంబర్ 117ను రద్దు చేయాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పుట్టపర్తిరూరల్, ఆగస్టు 18 : విద్యావ్యవస్థకు గొడ్డలి పెట్టుగా మారిన జీఓ నెంబర్ 117, 128లను రద్దు చేయాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డిని ఏపీటీఎఫ్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు అనంతపురంలోని పీవీకేకే కళాశాలలో ఆమెకు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనంకి అశోక్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు కోడూరు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి ఆర్ చంద్ర, జిల్లా గౌరవ అధ్యక్షుడు పీవీ మాధవ, రాష్ట్ర కౌన్సిలర్ బీకే ముత్యాలప్ప ఆదివారం వినతి పత్రం అందచేశారు. వారు మాట్లాడుతూ... పాఠశాలలోని ఉపాధ్యాయుల కొరతను తీర్చుటకు సర్దుబాటు ప్రక్రియను కాకుండా అర్హులైన ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతల ద్వారా ఖాళీలను భర్తీ చేయాలన్నారు. ఇందుకు ఎమ్మెల్యే మాట్లాడుతూ... మంత్రి నారాలోకేశ్ దృష్టికి ఈ సమస్యలు తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంపాదకుడు నరేష్ కుమార్, సీనియర్ నాయకులు త్రిమూర్తి, శ్రీనివాసు లు, మల్లికార్జున, రవికుమార్, ఉమాపతి, నాగభూషణ, బాల కదిరప్ప, నాగరాజు, నాగేంద్ర, ఎల్ చంద్ర, గోపాల్‌నాయక్, హరిప్రసాద్, కుళ్ళాయిరెడ్డి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో విద్యార్థులకు పోటీలు





అలంకరణలో బలరామ, సుభద్ర, జగన్నాథుడు, చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ధర్మవరంరూరల్, ఆగస్టు 18 : స్థానిక మార్కెట్ యార్డు సమీపంలోని ఇస్కాన్ మందిరంలో విద్యార్థులకు చిత్రలేఖనం, భగవద్గీత శ్లోకాలు, ఫ్యాన్సీ డ్రస్సుపై ఆదివారం పోటీలు నిర్వహించారు. ఈనెల 26న శ్రీకృష్ణజన్మాష్టమిని పురష్కరించుకుని విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించారు. సుమారు 200 మందికిపైగా బ్రిలియంట్, సాయి విక్టరీ, మహర్షి, పీసీఎంఆర్, జీవానంద స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. శ్రీకృష్ణుని బాల్యంలో గడిపిన విశేషాలను చిత్రలేఖనంతో పిల్లలు అద్భుతంగా వేశారు. అదేవిధంగా చిన్నారులు శ్రీకృష్ణుని, శ్రీరాముని, గోపికల వేషధారణలతో ఆకట్టుకున్నారు. ముందుగా మందిరంలో ఉన్న శ్రీజగన్నాథుడు, సుభద్ర, బలరామ ప్రతిమలకు విశేషంగా అలంకరించి హరినామ సంకీర్తనలు చేశారు. ఈ సందర్భంగా ధర్మవరం ఇస్కాన్ ధర్మప్రచారకులు శ్రీకృష్ణమాదవదాస్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ఆధ్యాత్మకతను, సృజనాత్మకతను పెంపొందించేందుకు ఈ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు.



నాటి ఉపాధ్యాయులు, విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమావేశం

ముదిగుబ్బ, ఆగస్టు 18 : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1991-92 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు 32 సంవత్సరాల తరువాత అదే పాఠశాలలో ఆదివారం సమావేశమయ్యారు. నాటి ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, వెంకటరమణ, కుళ్ళాయిరెడ్డి, ఇమామ్ షరీఫ్, చిన్న రమణ, నరసమ్మ, మురళీ, చంద్ర నారాయణను ఈ సమావేశానికి ఆహ్వానించి.. ఘనంగా సన్మానించారు.

జూదరుల అరెస్ట్

ధర్మవరంరూరల్, ఆగస్టు 18: స్థానిక కేశవనగర్‌లో పరమేశ్వరి ఫంక్షన్‌హాల్ సమీపంలో జరుగుతున్న గ్యాంబ్లింగ్‌పై టూటౌన్ సీఐ అశోక్‌కుమార్ తన సిబ్బందితో ఆదివారం మెరుపుదాడి చేశారు. ఈ దాడుల్లో జూదమాడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.1.20 లక్షలు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

రేపటి నుంచి రాఘవేంద్రుడి ఆరాధనోత్సవాలు



ధర్మవరంరూరల్, ఆగస్టు 18 : స్థానిక ఎస్‌బీఐ కాలనీలోని మంత్రాలయ రాఘవేంద్రస్వామి వారి మఠం ఆలయంలో మంగళవారం నుంచి గురువారం వరకు 353వ ఆరాధన మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం అర్చకులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ... మంగళవారం పూర్వఆరాధన, బుధవారం మధ్య ఆరాధన, గురువారం ఉత్తర ఆరాధన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరాధన సమయంలో సంపూర్ణ అలంకారసేవ, అన్నసంతర్పణసేవ, పుష్పాలంకరణ సేవ, విశేషఫల పంచామృతాభిషేక సేవ, కనకమహాపూజ, రజత పుష్పార్చన, సర్వసేవ, పల్లకీ ఉత్సవసేవ, హస్తోదకసహిత పంచామృతాభిషేక సేవలు నిర్వహిస్తామన్నారు. కావున భక్తాదులు ఈ ఆరాధన మహోత్సవాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు. పూజ కార్యక్రమాలకు సంబంధించి వివరాలకు 94412 30303, 95737 51918ను సంప్రదించాలని కోరారు.

ధర్మవరం రూరల్ సీఐ బాధ్యతల స్వీకరణ



సీఐ ప్రభాకర్‌ను సన్మానిస్తున్న నాయకులు

ధర్మవరంరూరల్ / బత్తలపల్లి, ఆగస్టు 18 : ధర్మవరం రూరల్ సీఐగా ఎన్ ప్రభాకర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి సీఐ ఆరోహణరావు పుట్టపర్తికి వీఆర్‌గా బదిలీపై వెళ్లారు. అనంతపురంలోని ఏసీబీ నుంచి బదిలీపై వచ్చిన సీఐ ప్రభాకర్ ఆదివారం బత్తలపల్లిలోని తన సర్కిల్ కార్యాలయంలోని బాధతలు స్వీకరించారు. ఆయనుకు తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చల్లా శ్రీనివాసులు, నరిశెట్టి సూరి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన ధర్మవరం రూరల్ పోలీస్‌స్టేషన్‌ను సీఐ తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. పలు కేసుల గురించి ఆరా తీశారు. నూతన సీఐకి ఎస్ఐ నరేంద్ర, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

బదిలీ అయిన సీఐకి సన్మానం

ధర్మవరంరూరల్, ఆగస్టు 18 : స్థానిక వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం నంద్యాల జిల్లా నందికొట్కూరుకు బదిలీ అయ్యారు. దీంతో సిబ్బంది ఆదివారం సీఐ సుబ్రహ్మణ్యంకు పట్టణ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఘన వీడ్కోలు సభను ఏర్పాటుచేశారు. డీఎస్పీ శ్రీనివాసులు, టూటౌన్ సీఐ అశోక్‌కుమార్, రూరల్‌సీఐ ప్రభాకర్, ఎస్ఐలు నరేంద్ర, శ్రీనివాసులు, ఏఎస్ఐ కేతన్న, స్టేషన్ సిబ్బంది సీఐ సుబ్రహ్మణ్యంను సత్కరించారు. తనకు వీడ్కోలు పలికిన పోలీసు ఉన్నతాధికారులకు, సహచర పోలీసు సిబ్బందికి, మిత్రులకు, పాత్రికేయులకు సీఐ సుబ్రహ్మణ్యం ధన్యవాదాలు తెలిపారు.



సీఐ సుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న డీఎస్పీ

సమస్యలు పరిష్కరిస్తాం



కాలువను పరిశీలిస్తున్న పీఏ, కమిషనర్

ధర్మవరంరూరల్, ఆగస్టు 18 : పట్టణంలోని సమస్యలను మంత్రి సత్యకుమార్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని మంత్రి కార్యాలయ పీఏ హరీష్ తెలిపారు. స్థానిక వరలక్ష్మీ థియేటర్ వెనుక ఉన్న ఇరిగేషన్ కెనాల్ కాలువ చిన్నదిగా ఉండటంతో వర్షపు నీరు, డ్రైనేజీ నీరు వీధుల్లోకి వస్తున్నాయని, ఈ సమస్యను పరిష్కారించాలని ప్రజలు మంత్రి కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. దీంతో ఆదివారం ఆ కాలువను పీఏ, మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. కెనాల్ ఎత్తు, వెడల్పు పెంచడానికి అవసరమైన అంచనా నివేదికలను సిద్ధం చేయాలని, త్వరలోనే పరిష్కారం చూపుతామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఆయన వెంట బీజేపీ నాయకులు జింకా చంద్రశేఖర్ ఉన్నారు.

అనాథాశ్రమానికి విద్యార్థుల చేయూత

ధర్మవరంరూరల్, ఆగస్టు 18: పట్టణంలోని సత్య కృప డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఔదార్యం చాటుకున్నారు. ఆదివారం మండలంలోని గొట్లూరు అనాథ ఆశ్రమంలోని వృద్ధుల కోసం డిగ్రీకళాశాల విద్యార్థినులు 20 కేజీల బియ్యం, పండ్లు సేకరించి అందజేశారు. విద్యార్థినులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థినులు హిమావతి, వెన్నల, కిరణ్మయి, సౌగాంధిక, సాయిశ్రీ, అనిత, రుచిత పాల్గొన్నారు.



బియ్యం, పండ్లు అందజేస్తున్న విద్యార్థినులు

నేడు ధర్మవరంలో మంత్రి పర్యటన

ధర్మవరంరూరల్: రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సోమవారం ధర్మవరంలో పర్యటించనున్నారని మంత్రి కార్యాలయ సిబ్బంది ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు పట్టణంలోని గొట్లూరు రహదారిలో ఉన్న సీబీఎన్ ఫంక్షన్‌హాల్ నందు రక్షాబంధన్ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అనంతరం సాయంత్రం ఐదు గంటలకు జూనియర్ కళాశాలలోని మైదానంలో శ్రీదేవిభూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవంలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం బెంగుళూరు వెళ్తారని తెలిపారు.

నిరుపేదకు ఆర్థికసాయం

తనకల్లు, ఆగస్టు 18: మండలంలోని నల్లగుట్లపల్లి గ్రామంలోని నిరుపేద రహంతుల్లాకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి పవన్ కుమార్ రెడ్డి రూ. పదివేల ఆర్థికసాయం ఆదివారం అందించారు. రహంతుల్లా కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ముతవల్లీ ఇమామ్‌మౌజాన్, అధ్యక్షుడు మహమ్మద్‌ఆలీనౌషాద్ పవన్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి.. ఈ ఆర్థికసాయం అందించారు. ఇందులో ఫకృద్దీన్‌సాబ్, మస్తాన్ రెడ్డి, ఇమామ్ సాబ్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణ మాస పూజలు

మడకశిర(అమరాపురం), ఆగస్టు 18: అతి పురాతన శైవక్షేత్రంగా ప్రసిద్ధి చెందిన అమరాపురం మండలంలోని హేమావతిలో ఆదివారం శ్రావణ మాస ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అక్కడ వెలసిన హెంజేరు సిద్ధేశ్వరస్వామికి తైలాభిషేకం, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం చేపట్టారు. అదేవిధంగా ఆలయ ప్రాంగణంలో ఉన్న కాలభైరవేశ్వరస్వామి, దొడ్డేశ్వరస్వామి, మల్లేశ్వరస్వామి దేవాలయాల్లో శ్రావణమాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శివకుమార్, సిద్దలింగేశ్వర, మహేష్‌కుమార్, గౌతమ్, ప్రదీప్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

రేపటి నుంచి సచివాలయాల్లో

ఆధార్ సేవాకేంద్రాలు: ఎంపీడీఓ

మడకశిర రూరల్, ఆగస్టు 18: మండలంలోని గ్రామ సచివాలయాల్లో మంగళవారం నుంచి ఆధార్ సేవా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ సోనియాబాయి, ఏఓ ఆరాధ్య తెలిపారు. మంగళవారం కల్లుమర్రి, సీ కొడిగేపల్లి, ఐవీ పాళ్యం, గోవిందాపురం, 21 న కదిరేపల్లి, మెళవాయి, చత్రం, ఆర్ అనంతపురం, బుళ్లసముద్రంలో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామ న్నారు. అలాగే 22న హరేసముద్రం, భక్తరహళ్లి, ఆమిదాలగొంది, ఏ ఆర్ రొప్పం, 23 న చందకచర్ల, గౌడనహళ్లి, వైబీ హళ్లి, 24న మణూరు, కె గుండుమల సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రజలు ఈ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన టీడీపీ మండల కన్వీనర్



టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌తో మండల కన్వీనర్ సిద్దయ్య

పెనుకొండ టౌన్, ఆగస్టు 18: నామినేటెడ్ పదవుల్లో తమకు ప్రాధాన్యం కల్పించాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను కలిసి బయోడేటను అందించినట్లు మండల కన్వీనర్ సిద్దయ్య తెలిపారు. అమరావతిలోని పార్టీ కార్యాలయంలో శనివారం రాష్ట్ర అధ్యక్షుడిని కలిసి 1995 నుంచి పార్టీకి చేసిన సేవలు, తనకు ఇచ్చిన పదవుల గురించి బయోడేటా అందించినట్లు తెలిపారు. పెనుకొండలో మంత్రి సవితకు కూడా బయోడేటా ఇచ్చినట్లు తెలిపారు. నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని కోరినట్లు సిద్దయ్య తెలిపారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి



రక్తదాన శిబిరంలో పాల్గొన్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి

గుడిబండ, ఆగస్టు 18 : రక్తదానం చేసి ప్రాణదాతలు కండి అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆది వారం చిరు ఫ్యాన్స్ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ అభిమానులు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా 75మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దుర్గేష్, శివకుమార్, కొంకల్లు కృష్ణమూర్తి, చిరంజీవి ఫ్యాన్స్ నాయకుడు నాగరాజు, మంజునాథ్, యశోద్, శాంతకుమార్, రాము, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

కొంకల్లులో వైద్యశిబిరం

గుడిబండ, ఆగస్టు 18 : మండలంలోని కొంకల్లు గ్రామంలో ఆదివారం వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు ఈఓఆర్డీ నాగరాజునాయక్ పంచాయతీ కార్యదర్శి ప్రకాశ్ తెలిపారు. గ్రామంలో జ్వరాలు, వాంతులు, విరేచనాలు అయినవారికి శిబిరంలో మందులు, మాత్రలు అందించినట్లు తెలిపారు. అదేవిధంగా గ్రామంలో డ్రైనేజీ, మురుగు కాలువలు, చెత్తాచెదారాన్ని తొలగించడంతో పాటు పైప్ లీకేజీకి మరమ్మతులు చేయించినట్లు తెలిపారు. ఈగలు, దోమలు వ్యాప్తి చెందకుండా గ్రామంలో బ్లీచింగ్ పౌడర్ చల్లినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి మంత్రి సంతాపం

పెనుకొండ రూరల్, ఆగస్టు 18 : రొద్దం మండలంలోని ఆర్ మరువపల్లిలో టీడీపీ సీనియర్ నాయకులు బాలానాయుడు అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న బీసీ సంక్షేమం చేనేత జౌళిశాఖ మంత్రి సవిత బాలానాయుడు భౌతికకాయాన్ని దర్శించి పూలమాలలువేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేవీవీ జిల్లా అధ్యక్షుడు మహేంద్రరెడ్డి

పెనుకొండ, ఆగస్టు 18: యువత శాస్త్రీయ దృక్పథం అలవరచుకోవాలని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు మహేంద్రరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఘనగిరి పాఠశాలలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక పెనుకొండ జోన్ కమిటీ ప్లీనరీ సమావేశాన్ని రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా జెండా ఆవిష్కరించి సమావేశాన్ని ప్రారంభించా రు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడారు. ఈ నెల పుట్టపర్తిలో జరిగే జిల్లాస్థాయి ప్లీనరీ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సభ్యులు మూడు తీర్మానాలు ప్రవేశపెట్టి ఆమోదించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి హరి, రామన్న, రాజశేఖర్, ఇలియాజ్, బాబా, మురళి, షౌకత్, జోన్ కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మందులతో వ్యాధికి చెక్

హిందూపురం అర్బన్: క్రమం తప్పకుండా మందులు వాడితే మూర్ఛవ్యాధి నయమవుతుందని జేవీవీ జిల్లా కార్యదర్శి డాక్టర్ ఈటీ రామ్మూర్తి పేర్కొన్నారు. పట్టణంలోని అల్‌హిలాల్ పాఠశాలలో ఆదివారంజనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 152వ మూర్ఛవ్యాధి శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంల వరకు చికిత్సలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు జేవీవీ పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ, శ్రీనివాసులు, ఓబుళేసు, గంగిరెడ్డి, లక్ష్మీపతి, మురళిమోహన్, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ చిన్నారి మృతి

బత్తలపల్లి, ఆగస్టు 18 : మండలంలోని అనంతసాగరంలో ప్రమాదవశాత్తు నీళ్ల బకెట్‌లో పడిన ఓ చిన్నారి చికిత్స పొందుతూ మరణించింది. రాప్తాడు మండలం పెనరకుంటకు చెందిన ఆదెప్ప, బత్తలపల్లి మండలం అనంతసాగరంలో ఐదేళ్ల క్రితం పుష్పను వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కూమార్తెలు. పుష్ప తమ్ముడి వివాహానికి అనంతసాగరం గ్రామానికి వెళ్లింది. శనివారం సాయంత్రం కుటుంబ సభ్యులు పెళ్లి పనుల్లో ఉండగా.. పుష్ప చిన్న కుమార్తె మేఘహర్షిత (18 నెలల) ఆడుకుంటూ బాత్‌రూంలోకి వెళ్లి... నీళ్ల బెకెట్‌లో పడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఆ చిన్నారి మరణించింది.

మహిళ ఆత్మహత్య

గోరంట్ల, ఆగస్టు 18: పట్టణంలోని ఎండాలబండ వీధిలో ఉంటున్న కుమ్మర మంజుల (26) కుటుంబ కలహాలతో విషద్రావకం తాగి ఆదివారం ఆత్మహత్య చేసుకుంది. కుమ్మర నంద, మంజుల దంపతులు చేనేత మగ్గం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. భార్య భర్తల మధ్య తగాదాల కారణంగా మంజుల విషద్రావకం తాగి ఆత్మహత్యకు పాల్పడింది. వెంటనే కుటుంబ సభ్యులు హిందూపురం తరలించి, అక్కడి నుంచి గౌరిబిదనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలికి ఆరేళ్ల కుమార్తె, నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు. కర్ణాటక పోలీసుల నుంచి అందిన సమాచారం మేరకు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



అలంకరణలో హెంజేరు సిద్దేశ్వరస్వామి



భక్తరహళ్లి నరసింహస్వామి



జిల్లేడగుంట ఆంజనేయస్వామి

ఘనంగా శ్రావణ మాస పూజలు

మడకశిర(అమరాపురం), ఆగస్టు 18 : అతి పురాతన శైవక్షేత్రంగా ప్రసిద్ధి చెందిన అమరాపురం మండలంలోని హేమావతిలో ఆదివారం శ్రావణ మాస ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అక్కడ వెలసిన హెంజేరు సిద్దేశ్వరస్వామికి తైలాభిషేకం, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం చేపట్టారు. అదేవిధంగా ఆలయ ప్రాంగణంలో ఉన్న కాలభైరవేశ్వరస్వామి, దొడ్డేశ్వరస్వామి, మల్లేశ్వరస్వామి దేవాలయాల్లో శ్రావణమాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శివకుమార్, సిద్దలింగేశ్వర, మహేష్‌కుమార్, గౌతమ్, ప్రదీప్ పూజా కార్యక్రమాలు నిర్వహిం చారు. స్థానిక భక్తులేకాకుండా రాష్ట్ర నలుమూలల నుంచి, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి పూజలు చేయించారు. శ్రావణమాసం రెండో ఆదివారం స్వామివారి దర్శనం కోసం భక్తులు క్యూకట్టారు. ఆలయ ప్రాంగణం శివ నామ స్మరణతో మార్మోగింది.

మడకశిర రూరల్ : శ్రావణ మాసం సందర్భంగా మండలంలోని ప్రసిద్ధిచెందిన భక్తరహళ్లి నరసింహస్వామి, జిల్లేడగుంట ఆంజనేయ స్వామి ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. మొక్కులు ఉన్న ఆంధ్ర, కర్ణాటక భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సమస్యల పరిష్కారానికి

సత్వరమే చొరవ చూపాలి

అధికారులకు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఆదేశం



కాలనీలో సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

మడకశిర, ఆగస్టు 18 : ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వరమే చొరవ చూపాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మున్సిపల్ అధికారులను ఆదేశించారు. హంగు ఆర్భాటాలు లేకుండా ఎమ్మెల్యే ఆదివారం నగర పంచాయతీ పరిధిలోని 1, 3, 4, 6వ వార్డులలోని కాలనీలలో పర్యటించారు. ప్రజలను అడిగి సమస్యలను తెలుసుకొన్నారు. ఒకటో వార్డులోని శివాపురంలో శ్మశాన వాటికకు దారి ఏర్పాటు, వీధి దీపాలు, తాగునీటి సమస్య తదితర వాటిని సత్వరమే పరిష్కరించాలని స్థానికులు ఎమ్మెల్యేని కోరారు. అదేవిధంగా నాలుగో వార్డులో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కాలనీలోని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే స్పందిస్తూ కాలనీలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన అధికారులకు సూచించారు.

గంపమల్లయ్యకు ప్రత్యేక పూజలు

శింగనమల, ఆగస్టు 18: మండలలోని గంపమల్లయ్య కొండ వద్ద శ్రావణ మాసం రెండో ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఏడాది శ్రావణ మాసంలో నాలుగు వారాలు గంపమల్లయ్యకు పూజలు చేయడం ఆనవాయితీ వస్తోంది. ఇక్కడ గంపమల్లయ్య గుహలోకి పోయే సన్నివేశం ప్రత్యేకమైనది. 2022లో గుహలోకి వెళ్లే సమయంలో పూజారి పాపయ్య ప్రమాదశాత్తు కొండ మీద నుంచి పడి మృతి చెందాడు. అప్పటి నుంచి రెవెన్యూ, పోలీసులు అధికారులు గుహ ప్రవేశాన్ని నిషేధించారు. గత వారం పూజారి పాపయ్య కుటుంబ సభ్యులు ఎలాంటి అనుమతులు లేకుండా గుహ ప్రవేశం చేయడంతో పోలీసులు, రెవెన్యూ అధికారులు పూజారి మునేంద్రను బైండోవర్ చేసిన విషయం తెలిసిందే. ఈ శని, ఆదివారాలు కొండ మీద బందోబస్తు ఏర్పాటు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భక్తులకు స్వామివారిని దర్శించుకునే ఏర్పాట్లు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తనకల్లు, ఆగస్టు 18: మండలంలోని నల్లగుట్లపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. మండల కేంద్రానికి చెందిన చిరు వ్యాపారులు శ్రీనివాసులు, కాలేషా ఓ శుభ కార్యక్రమానికి అన్నమయ్య జిల్లా ములకచెరువు వెళ్లారు. శనివారం రాత్రి ద్విచక్రవాహనంలో తనకల్లుకు వస్తుండగా... మార్గమధ్యలో నల్లగుట్లపల్లి సమీపంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడ్డారు. ఈప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కడపకు తరలించారు.

జూదరుల అరెస్ట్

ధర్మవరంరూరల్, ఆగస్టు 18: స్థానిక కేశవనగర్‌లో పరమేశ్వరి ఫంక్షన్‌హాల్ సమీపంలో జరుగుతున్న గ్యాంబ్లింగ్‌పై టూటౌన్ సీఐ అశోక్ కుమార్ తన సిబ్బందితో ఆదివారం మెరుపుదాడి చేశారు. ఈ దాడుల్లో జూదమాడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.1.20 లక్షలు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

ఎంపీ బీకేకి ఏపీటీఎఫ్ నాయకుల వినతి



ఎంపీకి వినతిపత్రం అందిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

పెనుకొండ, ఆగస్టు 18: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీటీఎఫ్ నాయకులు ఆదివారం ఎంపీ బీకే పార్థసారథిని పట్టణంలోని ఆయన స్వగృహంలో కలిసి వినతిప త్రం అందించారు. విద్యావ్యవస్థకు గొడ్డలిపెట్టుగా మారిన జీఓ117, 128లను రద్దుచేయాలని, పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తీర్చాలని, సర్దుబాటు ప్రక్రియ ద్వారా కాకుండా అర్హులైన ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించడంద్వారా ఖాళీలు భర్తీచేయాలని కోరారు. పాఠశాలల్లో కేవలం రెండు మాధ్యమాలను సమాంతరంగా కొనసాగించాలని, సీబీఎస్ఈ సిలబస్‌లోకి మార్చిన పాఠశాలలను తిరిగి స్టేట్ సిలబస్‌లోకి మార్చాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు కోడూరు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి చంద్ర, గౌరవాధ్యక్షుడు మాధవ, రాష్ట్ర కౌన్సిలర్ టీకే ముత్యాలప్ప, నరేష్‌కుమార్, త్రిమూర్తి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

పవిత్రోత్సవాలకు శ్రీకారం

ధర్మవరంరూరల్, ఆగస్టు 18 : స్థానిక కొత్తపేటలో శ్రీలక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయంలో ఏటా శ్రావణమాసంలో మూడు రోజులు పాటు నిర్వహించే పవిత్రోత్సవాలకు ఆదివారం శ్రీకారం చుట్టారు. ఉదయం ఆలయ అర్చకులు సునీల్‌కుమారాచార్యులు, సుదర్శ నాచార్య లు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను వివిధ రకాల పూల మాలలతో అలంకరించారు. వేదమంత్రాలతో మంగళవాయిద్యాల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం శ్రవణానక్షత్ర కల్యాణోత్సవం, సాయంత్రం అంకురార్పణ కార్య క్రమాన్ని నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ, అన్నమయ్య సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కోటంక ఆలయానికి ఆభరణాల సమర్పణ

గార్లదిన్నె, ఆగస్టు 28: మండలంలోని కోటంక గ్రామ సమీపంలో వెలసిన గుంటిసుబ్రహ్మణ్యేశ్వరస్వామికి భక్తులు రూ.59600 విలువ చేసే బంగారు అభరణాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతపురం పట్టణానికి చెందిన లావణ్య, సుధాకర్‌బాబు దంపతులు ఆదివారం స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. అనంతరం 8.870 గ్రాముల బంగారు మాంగళ్యాన్ని ఆలయ ప్రధాన అర్చకుడు రామాచార్యులకు అందజేశారు.

వర్షాలతో నిండుతున్న చెరువులు, కుంటలు



కళకళలాడుతున్న వేరుశనగ పంట

మడకశిర, ఆగస్టు 18: మడకశిర ప్రాంతంలో రెండు రోజులుగా కురుస్తున్న మోస్తరు వర్షాలకు కుంటలు, చెక్‌డ్యాంలకు, పలు చెరువులకు నీరు చేరుతోంది. హంద్రీనీవా కాలవల్లో నీరు ప్రవహిస్తోంది. అదేవిధంగా విత్తనం వేసినప్పటి నుంచి వర్షం కురవక ముందస్తు సాగు చేసిన వేరు శనగ, ఇతర పంటలు వాడు ముఖం పడుతుండేవి. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో కళకళలాడుతున్నాయి. ఈ వర్షాలు ప్రత్యామ్నాయ పంటల సాగుకు ఎంతో అనుకూలమని సంబంధిత శాఖ అధికారులు అంటున్నారు. దీంతో రైతులు హర్ష వ్యక్తం చేస్తున్నారు. పొలం పనుల్లో బిజీగా ఉన్నారు. నియోజకవర్గంలో శనివారం రాత్రి కూడా మోస్తరు వర్షం పడింది. ప్రత్యామ్నాయ పంటల సాగుకు సబ్సిడీతో విత్తనాలు అందించాలని రైతులు కోరుతున్నారు.



కొంకల్లు చెరువుకు చేరిన వర్షపునీరు

కళకళలాడుతున్న పంటలు.. రైతుల్లో ఆనందం

రోడ్లపై నిలిచిన నీరు: వర్షాలతో రైతులు సంతోషంగా ఉన్నా గుంతల మయమైన రోడ్లు జలమయం కావడంతో వాహనదారులు రాక పోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వర్షం వచ్చినప్పుడల్లా గుంతల్లో నీరు చేరి ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే రోడ్ల మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. మడకశిర సమీపంలోని మధుగిరి రోడ్డు, మడకశిర బైపాస్ రోడ్డులో గుంతలు ఎక్కువగా ఉన్నాయి.

గుడిబండ : మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వంకలు, వాగులు, పొంగి ప్రవహిస్తున్నాయి. పలు చెరువుల్లో భారీగా నీరు చేరింది. మండలంలోని ఎస్ రాయాపురం, పూజారిపల్లి, ఎస్ఎస్ గుండ్లు, మేకలగట్ట, మందలపల్లి, కొంకల్లు, గుడిబండ తదితర గ్రామాల్లో వంకలు, వాగులు, పొంగి పొర్లాయి. కొంకల్లు చెరువుకు నీరు చేరింది. బోరుబావుల్లో నీటిమట్టం పెరిగిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఎస్ రాయాపురం వద్ద ప్రవహిస్తున్న వంక

అండర్‌బ్రిడ్జి కింద నీటి తొలగింపు



అండర్‌బ్రిడ్జి కింద నిల్వ ఉన్న నీటిని పరిశీలిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ రూరల్, ఆగస్టు 18: ఇటీవల కురుస్తున్న వర్షాలకు పట్టణ సమీపంలోని షీప్‌ఫారం వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి కింద భారీగా వర్షపునీరు నిలువ చేరింది. రొద్దానికి వెళ్లే రహదారిలో ఇలా ఉండడంతో అటుగా వెళ్తున్న వాహనాలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. రొద్దం మండలం పర్యటనకు ఆదివారం వెళ్లిన మంత్రి సవిత అండర్‌బ్రిడ్జి కింద ఉన్న నీటిని పరిశీలించారు. వెంటనే స్పందించిన మంత్రి నీటిని తొలగించాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ఆర్‌అండ్‌బీ అధికారులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని నీటిని తొలగించారు.

రజకుల సమస్యలు పరిష్కరించాలని వినతి



మంత్రి సవితను కలిసిన రజక సంఘం నాయకులు

గోరంట్ల, ఆగస్టు 18: రజకులు వృత్తిపరంగా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖల మంత్రి సవితకు టీడీపీ రాష్ట్ర రజక సాధికార కమిటీ డైరెక్టర్ రామచంద్ర ఆధ్వర్యంలో ఆదివారం విజ్ఞప్తి చేశారు. పలువురు రజకులతో మంత్రిని కలిసి తమ కష్టాలు సాధకబాధకాలను వివరించగా మంత్రి సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. మండల కేంద్రాల్లో రజకులకు కమ్యూనిటీ హాల్, దోబీఘాట్, ఇళ్ల స్థలాలు, పనిముట్లు మంజూరు చేయాలని, రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలంటూ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మంత్రికి అందించారు. రజక సంఘం నాయకులు చేలూరి నరసింహులు, శ్రీనివాసులు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో గంగపూజ



చెరువుకు హారతి ఇస్తున్న మాజీ ఎంపీపీ

పెనుకొండ రూరల్, ఆగస్టు 18 : ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలోని మునిమడుగు చెరువుకు భారీగా వర్షం నీరు చేరింది. టీడీపీ నాయకుడు, మాజీ ఎంపీపీ మునిమడుగు వెంకటరాముడు ఆధ్వర్యంలో ఆదివారం చెరువులో గంగపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వయనాడ్ బాధితుల కోసం విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న సీఐటీయూ నాయకులు

హిందూపురం అర్బన్, ఆగస్టు 18: కేరళ రాష్ట్రంలోని వయనాడ్ వరద బాధితులను ఆదుకోవాల్సిన బాధ్యత మనందరిదీ అని సీఐటీయూ నాయకులు పేర్కొన్నారు. వయనాడ్ వరద బాధితుల సహాయార్థ వారు ఆదివారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, ఎన్టీఆర్ సర్కిల్, సద్భావన్ సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్‌లలోని హోటళ్లు, చిరువ్యాపారుల వద్ద విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వారికి మనం చేతనైనంత సాయం అందిద్దామని ప్రతి ఒక్కరినీ అభ్యర్థించారు. అలాగే కేరళ రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ నాయకుడు వీఆర్ రాము, నాయకులు రామకృష్ణ, రియాజ్, రెహమాన్, శ్రీధర్, శీన మోహన్, ఆటో యూనియన్ రమకృష్ణ, దేవరాజ్ తదితరులు ఉన్నారు.

గవర్నర్ నిర్ణయానికి వ్యతిరేకంగా

నేడు పావగడలో కాంగ్రెస్ ర్యాలీ

పావగడ, ఆగస్టు 18 : ముడాలో అక్రమంగా ఇంటి స్థలాలు పొందారని అనే ఆరోపణలతో ముఖ్యమంత్రి సిద్దరామయ్యపై ప్రాసిక్యూషన్‌కు అనుమతించి రాష్ట్ర గవర్నర్ తావర్చంద్ గెహ్లోటి బీజేపీకి తొత్తుగా మారారని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపించారు. గవర్నర్ నిర్ణయానికి వ్యతిరేకంగా సోమవారం పావగడలో కాంగ్రెస్ పార్టీ తరుపున ర్యాలీ చేపడుతున్నట్లు కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు సురేష్ బాబు, రూరల్ అధ్యక్షుడు రామాంజినప్ప ఆదివారం పత్రికా ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు నినాదాలతో ర్యాలీగా వెళ్లి తాలూకా కార్యాలయం చేరుకుంటామన్నారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తామన్నారు. ఎమ్మెల్యే వెంకటేష్, మాజీ ఎమ్మెల్యే వెంకటరమణ, సారథ్యంలో నిర్వహించే ఈ ర్యాలీని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని పాదయాత్రను విజయవంతం చేయాలని వారు కోరారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



బహుమతి ప్రదానం చేస్తున్న టీడీపీ నాయకుడు డీఈ రమేష్

హిందూపురం అర్బన్, ఆగస్టు 18: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని టీడీపీ పట్టణాధ్యక్షుడు, ఆరో వార్డు కౌన్సిలర్ డీఈ రమేష్ పేర్కొన్నారు. స్థానిక పాండురంగనగర్‌లోని వివేకానంద యోగా థెరపీ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి యోగాసనాల పోటీల బహుమతి ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం యోగాలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. పోటీల్లో హిందూపురం నుంచే కాకుండా ధర్మవరం, ముదిగుబ్బ, పరిగి, లేపాక్షి, సంతేబిదనూర్ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన దాదాపు 150 మంది పాల్గొన్నారు. ఏపీ యోగా అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, దివాకర్, గురురాజారావు, కృష్ణవేణి, తారక రామయ్య, రాజేశ్వర, సూర్యకుమార్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. వారితోపాటు అసోసియేషన్ కార్యదర్శి సుబ్బరాయుడు, సహాధ్యక్షులు బద్రీనారాయణ, దేవాంగం శంకరప్ప, మాకం బాలాజీ, మహేంద్ర, భారతి, వెంకటేష్, యోగా శిక్షకులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజేతలు సెప్టెంబరు నెలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు.